సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

టీడీఆర్‌కు దరఖాస్తులు చేసుకోవాలి



టీడీఆర్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏసీపీ ఝాన్సీ

జగదాంబ: వన్ టౌన్ రహదారి విస్తరణలో ఆస్తులు నష్టపోయిన వారందరూ సోమవారం నాటికి టీడీఆర్‌లు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏసీపీ ఝాన్సీ కోరారు. శనివారం ఆమె సెక్రెటరీలతో కలిసి టీడీఆర్‌లు ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ జగదాంబ నుంచి వన్ టౌన్ పోలీసు స్టేషన్ వరకు రహదారి విస్తరణ జరిగింది. ఇందుకు సంబంధించి 277 మంది లబ్ధిదారులు వారి భవనాలు తాత్కాలికంగా, శాశ్వతంగా కోల్పోయారు. ఈనెల 11 నుంచి టీడీఆర్ ప్రక్రియ జోన్ –4 కార్యాలయంలో ప్రారంభమైందన్నారు. అయితే నష్టపోయిన లబ్ధిదారుల్లో సగానికి పైగా డాక్యుమెంట్లు ఇవ్వలేదన్నారు. వారందరూ సోమవారం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి జోనల్ కార్యాలయంలో డాక్యుమెంటేషన్లు తీసుకోవడం జరుగుతుందన్నారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న దాడి సత్యనారాయణ

దాబాగార్డెన్స్: వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని నేషనల్ కన్జ్యూమర్ రైట్స్ కమిషన్ సౌతిండియా చైర్మన్ దాడి సత్యనారాయణ కోరారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువులు, వాటి కోసం వెచ్చించే రుసుము విషయంలో న్యాయం జరగకపోతే తాము స్పందిస్తామన్నారు. చాలా మంది వినియోగదారులు అవగాహన లేక ఇబ్బందులు పడతున్నారని చెప్పారు. సైబర్ నేరాలపై ప్రభుత్వం ఏ విధంగా అవగాహన కల్పిస్తుందో, అదే విధంగా వినియోగదారులకు అవగాహన కల్పించే దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. వినియోగదారులు ఎటువంటి సమస్యలున్నా 98483 11566 నంబర్లో సంప్రదించవచ్చని చెప్పారు.

ఆర్వోప్లాంట్ ఏర్పాటుకు హామీ

మహారాణిపేట: ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. విశాఖ సేఫ్టీ కౌన్సిల్ ట్రైనింగ్ – డెవలప్‌మెంట్ ట్రస్ట్, రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ ఐ.ఆర్.ఐ.ఎస్. (ఆంధ్ర మెడికల్ కాలేజ్) సంయుక్తంగా శనివారం కేజీహెచ్‌లోని గవర్నమెంట్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు 20 మంచాలను విరాళంగా ఇచ్చారు. ప్రభుత్వ నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ కేవీ మంగా దేవి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కేజీహెచ్ సిబ్బంది, డాక్టర్లు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మోహర్‌కుమార్, సీహెచ్ బాల సతీష్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రమాదం సుమా..!



బంగారు భవిష్యత్తు ఉన్న విద్యార్థులు ప్రయాణ సమయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి. కాలేజీలు, పరీక్షలకు వెళ్లేందుకు ఆటోలలో పరిమితికి ప్రయాణించడం ప్రమాదకరం. దురదృష్టవశాత్తు ఏ చిన్న ప్రమాదం జరిగినా భవిష్యత్తు అంధకారంగా మారిపోతుంది. నగరంలో పరిమితికి మించి ఆటోల్లో విద్యార్థులు ప్రయాణిస్తున్నారదానికి ఈ ఫొటోయే నిదర్శనం.


– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

అరిగేవే ఆరగించు... సత్ఫలితాలు సాధించు..!


పిల్లల ఆహారం విషయంలో తల్లిదండ్రులు ఎప్పుడూ కంగారు పడుతూనే ఉంటారు. పరీక్షల సమయంలో ఆ ఆందోళన మరింత ఎక్కువేనని చెప్పాలి. ఇంటర్ పరీక్షలు ఇప్పటికే ముగిశాయి. పదో తరగతి విద్యార్థులు ప్రిపరేషన్‌లో నిమగ్నమయ్యారు. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు రాత్రింబవళ్లు నిద్రాహారాలు మానేసి చదువు ధ్యాసలో పడిపోతున్నారు. ఈ క్రమంలో సక్రమమైన ఆహారం కూడా తీసుకోవడం లేదు. ఇది మంచి పద్ధతి కాదని నిపుణులు చెబుతున్నారు. పరీక్షల సమయంలో సమతుల్య ఆహారం కచ్చితంగా తీసుకోవాలని సూచిస్తున్నారు. పిల్లల డైట్ విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని వైద్యులు చెబుతున్నారు.

-అల్లిపురం

- పరీక్షల సమయంలో సాత్వికాహారమే ఉత్తమమంటున్న వైద్యులు
- నూనె పదార్థాలతో అతి దాహం
- చికెన్, మటన్‌లకు దూరంగా ఉంటేనే మేలు



ఇలా చేయండి...



- ప్రణాళిక ప్రకారం చదవాలి
- మంచి ఆహారం తినండి. డ్రైఫ్రూట్స్‌తో పాటు మంచినీళ్లు ఎక్కువగా తాగండి
- తగిన విశ్రాంతి తీసుకోవాలి
- ఉదయం లేవగానే వ్యాయామం గానీ, యోగాగానీ చేయాలి
- ఒత్తిడి నుంచి బయటపడాలంటే లైట్ మ్యూజిక్ వినండి

ఇలా వద్దు

- మొబైల్‌కు, గేమింగ్ జోన్లకు దూరంగా ఉండండి
- మిమ్మల్ని మీరు ఇతరులతో పోల్చుకోవద్దు
- గతంలో మీ పనితీరు మంచిదా చెడ్డదా అని ఆలోచించకండి
- అనవసరంగా ఏదీ ఊహించుకోకండి
- ఇతరులను అనుసరించ వద్దు



పరీక్షల సమయంలో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నట్లు కనిపిస్తోంది. ఈ పరిస్థితి నుంచి వారిని బయటకు తీసుకురావడానికి ఆహారంలో కొన్ని పదార్థాలు చేర్చాలి. ఇవి ఆరోగ్యానికి, మానసిక ఆరోగ్యానికి ఎంతో సహాయపడతాయి. పిల్లలు ఒత్తిడికి గురికాకుండా ఉంటారు. పరీక్షల సమయంలో పిల్లలకు అందించే ఆహారంలో మార్పులు చేయడం మంచిది. మీకు ఆశ్చర్యంగా అనిపించినా..ఆహారం పిల్లల మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. పరీక్ష ఒత్తిడిని అధిగమించడానికి అనుసరించాల్సిన కొన్ని ఆహార చిట్కాలు పాటించాలి.

నూనె పదార్థాలకు దూరంగా ఉండండి

పరీక్షల సమయంలో అధిక మొత్తంలో కాఫీ, ఎనర్జీ డ్రింక్స్ తాగడం వల్ల మీ నిద్ర షెడ్యూల్‌కు ఆటంకం కలుగుతుంది. టీలు, కాఫీలు, ఎనర్జీ డ్రింక్స్ విశ్రాంతికి దూరంగా ఉండేలా చేస్తాయి. కాబట్టి ఇలాంటి వాటికి దూరంగా ఉండండి. ఉదయం తీసుకునే అల్పాహారంలో నూనె వస్తువులు లేకుండా చూసుకోవాలి. ఆయిల్ ఫుడ్స్‌ను బ్రేక్ ఫాస్ట్‌లో తీసుకోవడంతో తరచూ దాహం వేస్తుంది. దీంతో పరీక్ష రాసే సమయంలో విద్యార్థులు ఇబ్బంది పడతారు. తప్పనిసరిగా అల్పాహారం తీసుకోవాలి. సులువుగా అరిగిపోయే ఆహార పదార్థాలను టిఫిన్‌గా తీసుకుంటేనే మేలు. మిక్స్‌డ్ వెజిటెబుల్ కిచిడీ, గోధుమ రవ్వ ఉప్మా, ఇడ్లీ కూడా బ్రేక్ ఫాస్ట్‌గా తీసుకోవచ్చు.

జ్ఞాపకశక్తి కోసం బీ–12 విటమిన్ : విద్యార్థులు చదివింది గుర్తుపెట్టుకోవడానికి విటమిన్ బీ–12 ఉపయోగ పడుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుదలకు ఉపయోగపడే ఈ విటమిన్ మాంసపు ఉత్పత్తులలో అధికంగా లభిస్తుంది. మాంసం తినడానికి ఇష్టపడని వారు రోజుకు రెండు ఉడికించిన గుడ్లు తినడం మంచిది. మధ్యాహ్నం భోజనంలో ఒక ఆకుకూర తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. కూర, పెరుగు, మజ్జిగ తీసుకోవాలి. భోజనం తరువాత ఏదైనా ఒక పండు తింటే మంచిది.

సమయానికి తినండి

సమయానికి ఆహారం తీసుకోకపోవడం అనారోగ్యానికి గురి చేస్తుంది. ముఖ్యంగా పరీక్షల సమయంలో టైం టు టైం భోజనం చేయాలి. పరీక్షా సమయాల్లో భోజనం చేయకపోవడం అనారోగ్యం, చికాకు, తక్కువ శక్తికి దారితీయవచ్చు. రాత్రి 7.30 కల్లా భోజనం ముగించాలి. పప్పు, రసం, సాంబారు, పెరుగు, మజ్జిగ ఉండేలా చూసుకోవాలి. నిద్రకు గంట ముందుగా గ్లాసు పాలు తాగడం ఉత్తమం. రాత్రుల్లు ఎక్కువ సమయం వేచి ఉండవద్దు. సరిపడా కంటికి నిద్ర లేకపోతే అనేక అనర్థాలు తలెత్తుతాయి. కనీసం ఏడు గంటలు నిద్రపోవడం మంచిది. సీజన్‌లో లభించే పండ్లు, ముఖ్యంగా విటమిన్ సీ ఎక్కువగా లభించేవి తీసుకోవడం చాలా మంచిది.

పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

మాంసాహారం తగ్గించడం ఉత్తమం



పరీక్షల సమయంలో విద్యార్థుల్లో విపరీతమైన ఒత్తిడి వల్ల ఇరిటబుల్ బౌల్ సిండ్రోమ్ ఎక్కువ అవుతుంటాయి. వాంతులు, విరోచనాలు, కడుపులో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. విద్యార్థులు సాఫ్ట్ డైట్ తీసుకోవాలి. ముఖ్యంగా వెజిటుబల్స్, ఫ్రూట్స్ సలాడ్స్ ఎక్కువగా తీసుకొని మాంసాహారాన్ని సాధ్యమైనంత మేర తగ్గించడం చాలా మంచిది.

– డాక్టర్ ఆదిత్య
టి. సివిల్ సర్జన్

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొన దలచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ కార్యనిర్వహణాధికారి కె శోభారాణి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో ‘శక్తి యాప్’ రిజిస్ట్రేషన్

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ‘శక్తి యాప్’ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల వుమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ మంజుల పాల్గొని శక్తి యాప్‌లో ప్రతి విద్యార్థి రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని, తద్వారా ఎటువంటి అనుకోని, అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ విభాగం ద్వారా సులభంగా బయటపడవచ్చని సూచించారు. ఫోర్త్ టౌన్ ఎస్సై కోనేటి నరసింగరావు మాట్లాడుతూ శక్తి యాప్ మహిళల రక్షణ, భద్రతకు ముఖ్యమైనదని, యాప్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులచే రిజిస్ట్రేషన్ చేయించారు. కార్యక్రమంలో వుమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ ఎస్ అనురాధ, డాక్టర్ విజయ ప్రశంస, డాక్టర్ వరలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు డాక్టర్ కేఎల్ శిరీష, డాక్టర్ లావణ్య, డాక్టర్ హైమావతి పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వద్దే వద్దు



క్లాత్‌బ్యాగులు, పేపర్ కవర్లు ప్రదర్శిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట: స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడో శనివారం కేజీహెచ్ పరిశుభ్రత ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించవద్దంటూ నర్సులు, సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ వీరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బదులు క్లాత్ సంచులు, పేపర్ కవర్లు, స్టీల్ డబ్బాలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ డి.రాధాకృష్ణన్, వైద్యులు జి.వాసవీలత, వి.రవి, డీసీఎస్ఆర్ఎంవో జి.మెహర్ కుమార్, అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ, స్వచ్ఛాంధ్ర నోడల్ అధికారి డాక్టర్ ఏ.రాజేష్, నర్సింగ్ సూపరింటెండెంట్లు సీహెచ్.పద్మావతి. ఎన్.కల్పనా మాళి, బి.ఎస్.ఎస్. లత, మినిస్టీరియల్ సిబ్బంది, నర్సింగ్ స్టూడెంట్స్ పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్వస్తి చెబుదాం

అందరం కలసి స్వచ్ఛాంధ్ర సాదిద్దామని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. శనివారం జోన్ పరిధిలో జీవీఎంసీ 35వ వార్డు పూర్ణా మార్కెట్ వద్ద వ్యాపారులతో కలసి స్వర్ణాంధ్రా..స్వాచ్ఛాంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ విశాఖ కీర్తి ప్రతిష్టలు పెంపొందించేలా కార్యక్రమానికి ప్రజలు భాగస్వామ్యులు కావాలన్నారు. అనంతరం పూర్ణామార్కెట్ నుంచి బౌడారారోడ్డు మీదగా రామకృష్ణరైతుబజార్ వరకు స్వచ్ఛాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏఎంహెచ్ఓ కృష్ణంరాజు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మావతి, శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, వార్డు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సెక్రెటరీలు, పూర్ణామార్కెట్ వ్యాపారులు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోల్లో..

దాబాగార్డెన్స్: స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మార్చి నెల థీమ్ ‘సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్వస్తి పలుకుదాం’ కార్యక్రమాన్ని శనివారం విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ మంజుల పాల్గొని తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర చెత్త వేరు చేసే విధానంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అండ్ రీయూజబల్‌పై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యక్రమ కన్వీనర్ ఎన్ నిర్మలాకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు ఎస్ అనురాధ, డాక్టర్ కేఎల్ శిరీష, డాక్టర్ ఎల్ లావణ్య డాక్టర్ ఏ హైమావతి, కళాశాల ఎన్‌సీసీ అధికారి కె.గీతాంజలి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, గ్రంథాలయాధికారి ఆర్‌సీహెచ్ వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠకులు, సిబ్బందిచే స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఉప గ్రంథాలయాధికారి పీవీ నూకరాజు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

ఏపీఎస్‌ఆర్‌టీసీ పలు డిపోల్లో..

ఏపీఎస్ఆర్‌టీసీ విశాఖ జిల్లాలో గల అన్ని డిపోల్లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి బి అప్పలనాయుడు పాల్గొని సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. డిపో పరిధిలో పరిశుభ్ర కార్యక్రమం చేపట్టారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధిస్తూ ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రతి ఒక్కరూ పాటించాలని ప్రజా రవాణా అధికారి సంబంధిత డిపో మేనేజర్లు, సూపర్వైజర్లు, సిబ్బందికి సూచించారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి

అల్లిపురం: ప్లాస్టిక్ వినియోగించం తగ్గించి, పర్యావరణాన్ని కాపాడాలని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి కోరారు. అచ్చియ్యమ్మపేట, జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్, జీవీఎంసీ అధికారులు సిబ్బంది, సచివాలయ సెక్రటరీలు, ఆర్పీలు పాల్గొన్నారు.

అల్లిపురం శాఖా గ్రంథాలయంలో..

అల్లిపురం శాఖా గ్రంథాలయంలో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేపట్టారు. గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు ఆధ్వర్యంలో పరిశుభ్రత చేపట్టారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

మహారాణిపేట: రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా మీడియా విస్తరణ అధికారి(డీమో) ఎం.నాగేశ్వరరావు చీపుర్లతో ఆవరణను శుభ్రం చేశారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం పరిసరాల పరిశుభ్రత కోసం కొంత సమయం కేటాయించాలన్నారు. కార్యాలయంలో టేబుళ్లు, కంప్యూటర్లు, రికార్డులు, కిటికీలు, టాయిలెట్లు, టెరస్లను శుభ్రపరిచారు. టెర్రస్, ఆఫీస్ గోడలపైన పెరిగిన మొక్కలను తొలగించారు. ప్రోగ్రాం అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, కార్యాలయ సిబ్బంది తమ సెక్షన్లతోపాటు పరిసరాలను శుభ్రం చేశారు.



పూర్ణామార్కెట్ వద్ద వ్యాపారులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు



మద్దిలపాలెం డిపోలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు



అచ్చియ్యమ్మపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తోట పద్మావతి

ముగిసిన కేంద్ర బృందం పర్యటన



డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావుతో భేటీ అయిన కేంద్ర బృందం

మహారాణిపేట: పలు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో సర్వే శనివారంతో ముగిసింది. ఈ నెల 10 నుంచి శనివారం వరకు కేంద్ర పాపులేషన్ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన కేంద్ర బృంద ప్రతినిధులు డాక్టర్ రమణ, డాక్టర్ పాదాలు నాయకత్వంలో జిల్లాలోని పలు ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణఆరోగ్య కేంద్రాలను పరిశీలించింది.ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం రేసవానిపాలెంలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ (డిఎంహెచ్‌వో) కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావుతో బృందం భేటీ అయింది. కేజీహెచ్, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రులపై కొన్ని సూచనలు చేసింది. సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖకు చెందిన వివిధ విభాగాల అధికారులు డాక్టర్ బి.ఉమావతి, శాంతిప్రియ, శ్రీనివాస్, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్ర బాబు, జిల్లా సమన్వయకర్త డాక్టర్ హారిక, జిల్లా ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు వేయండి మహా ప్రభో..



ప్రమాదాలకు నిలయంగా 38వ వార్డు యాసీన్ బాబా దర్గా ప్రాంతం

దాబాగార్డెన్స్: నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. చిన్న పిల్లలు ప్రమాదాల భారిన పడతున్నారు. యువకులు బైక్‌లపై రెచ్చిపోతున్నారు. వీధుల్లో వారి రైడింగ్‌ల కారణంగా ఎంతో మంది ఆవేదనకు గురవుతున్నారు. రెచ్చిపోతున్న యువత బైక్ రైడింగ్‌లకు స్పీడ్ బ్రేకర్ల ద్వారా ఫుల్‌స్టాప్ పెట్టాలంటూ గత ఏడాదిగా జీవీఎంసీ..పోలీస్ సిబ్బందిని మొత్తుకున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. సాక్షాత్తు జీవీఎంసీ జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైందని 38వ వార్డు పరిధి యాసీన్ బాబా దర్గా ప్రాంత వాసి డాక్టర్ రియాజ్ అహ్మద్ ‘సాక్షి’ దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో యువకుల బైక్ రైడింగ్ కారణంగా అనేక మంది పిల్లలు పలు ప్రమాదాలకు గురయ్యారని, తాజాగా శుక్రవారం ఓ బాలుడ్ని ఓ యువకుడు బైక్‌తో ఢీకొట్టడంతో, ఆ బాలుడు చెయ్యి విరిగి మంచాన పట్టాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తరహా ప్రమాదాలు తరచూ సంభవిస్తున్నా..ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరవవుతోందని డాక్టర్ రియాజ్ అహ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలకు చెక్ పెట్టాలంటే..ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు వెంటనే వేయాలని కోరారు.

జీవనోపాధి కోల్పోతున్న సంప్రదాయ మత్స్యకారులు



సమావేశంలో మాట్లాడుతున్న కనకారావు

దాబాగార్డెన్స్: ఆర్థిక సరళీకరణ, ప్రవేటీకరణ విధానాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు సాగరమాల, బ్లూ ఎకానమీ, కోస్టల్ రెగ్యులేషన్ జోన్, టూరిజం తదితర ప్రాజెక్టుల అమలు చేస్తున్నాయని, ఫలితంగా సముద్ర తీర ప్రాంతాల్లో నివశిస్తున్న సంప్రదాయ మత్స్యకారులు క్రమ క్రమంగా తమ జీవనోపాధి కోల్పోతున్నారని కాన్ఫడరేషన్ ఆఫ్ ఫ్రీ ట్రేడ్ యూనియన్స్ ఆఫ్ ఇండియా(సీఎఫ్‌టీయూఐ)జాతీయ అధ్యక్షుడు ఎన్ కనకారావు ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంప్రదాయ మత్స్యకారులు అనేక రకాలుగా దోపిడీ, పీడనకు గురవుతున్నారని, వీరిని గ్రామాల నుంచి బలవంతంగా పునరావాస కాలనీలకు తరలించడం వల్ల, నివాసాలు, గుర్తింపు, చివరకు వారి ఆత్మ గౌరవాన్ని కూడా కోల్పోతున్నారన్నారు. దీనిని ఆసరాగా తీసుకుంటున్న కొన్ని ఏజెన్సీలు మంచి వేతనాలు, సామాజిక, సంక్షేమ, భద్రత పథకాలు అందిస్తామని మత్స్యకారులను మభ్యపెట్టి ఇతర దేశాలకు చట్ట వ్యతిరేకంగా మానవ అక్రమ రవాణాకు పూనుకుంటున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో సీఎఫ్‌టీయూఐ పలు సంస్థల సహకారంతో మత్స్యకార గ్రామాల్లోని నాయకులు, మహిళా సంఘాలు, వలంటీర్లు ఆయా ప్రాంతాల వాసులకు వర్క్‌షాప్స్, శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ, అనకాపల్లి జిల్లాల ప్రభుత్వ అధికారుల సహకారంతో చట్ట వ్యతిరేకంగా జరుగుతున్న ఏ కార్యక్రమాన్నైనా ఎదుర్కొనే విధంగా మత్స్యకారులకు అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు. సీఎఫ్‌టీయూఐ ప్రతినిధి బృందం రెండేళ్లలో 100 గ్రామాలు సందర్శించిందని, సంప్రదాయ మత్స్యకారులను సంఘటిత పరచి,వారిని భాగస్వాములను చేసి అవగాహన సదస్సులు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. సమావేశంలో సంస్థ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.లక్ష్మి, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ కె.ఉదయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. తాతకు ఎంతకష్టమొచ్చిందో..!



ఆ వృద్ధుడు ఎవరో తెలియదు..ఆకలితో అలమటిస్తున్నాడు. సీపీ కార్యాలయానికి వెళ్లే ప్రధాన గేటుకు కుడివైపున నెలరోజులుగా ఆ వృద్ధుడు నడవలేని స్థితిలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. దారిన పోయేవాళ్లు ఆహారం అందజేస్తున్నారు. శనివారం ఓ చిన్నారి అల్పాహారం..మంచినీటి బాటిల్ అందజేసింది. -దాబాగార్డెన్స్

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ సౌత్
9010810033, 7075989701
Office mail : sakshiadvtvsp@gmail.com